
ప్రజాశక్తి
సోమవారం 4 ఆగస్టు 2025
పార్వతీపురం మన్యం



నేడు జర్నలిస్టుల డిమాండ్స్ డే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం విజయనగరంలో డిమాండ్స్ డేను నిర్వహిస్తున్నట్లు ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వద్ద జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు, పెన్షన్ చెల్లింపు, అక్రిడిటేషన్ల జారీకి వీలుగా కొత్త జిఒ తీసుకురావడం, మీడియాలోని ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల అవార్డులను ప్రదానం చేయడం, రాష్ట్ర కేంద్రంలో వృద్ధ జర్నలిస్టుల కోసం ఓల్డేజ్ హోం నిర్మాణం తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, అనంతరం కలెక్టర్‌కు వినతి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎత్తిపోతల పథకాలు ఉట్టిపోవడమేనా?

జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో ఉండే సన్న, చిన్న కారు రైతులకు సాగు నీరందించాలనే సంకల్పంతో ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వాలు చేపట్టాయి. వీటి ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరందించేందుకు కోట్లాది రూపాయిలను ఖర్చు చేసి నిర్మించి, వాటి నిర్వహణ స్థానిక రైతులకు అప్పజెప్పడంలోనే అసలు తిరకాసు. వ్యవసాయం చేసే రైతులకు నిరక్షరాస్యులు కావడంతో ఈ పథకం నిర్వహణ పట్ల సరైన అవగాహన లేకపోవడం, ఏ చిన్న మరమ్మతు వచ్చినా ఇందుకు సంబంధించిన మెకానికులు అందుబాటులో లేకపోవడం మొదలైన విషయాలతో ఎత్తిపోతల నిర్వహణ రైతులకు, రైతు సంఘాలకు తలకు మించిన భారమవుతుంది.

- **సాగునీటి పథకాలకు నిధులు విదల్చని ప్రభుత్వం**
- **అన్నదాతపైనే విద్యుత్ ఛార్జీల గుదిబండ**

ప్రజాశక్తి -సాలూరురూరల్

సాలూరు నియోజకవర్గంలో సుమారు 7 ఎత్తిపోతల పథకాల ద్వారా వెయ్యి ఎకరాలకు నీరందించాలని సంకల్పంతో రూ.10.50కోట్లు ఖర్చు చేసి అప్పటి కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు వీటిని నిర్మించాయి. అయితే అంతవరకు బాగానే ఉన్నా వీటి నిర్వహణ మాత్రం రైతులకు అప్పజెప్పడంతో నియోజవర్గంలో ఉన్న ఏడు ఎత్తిపోతల పథకాల్లో ఒక్క కరాసవలస ఎత్తిపోతల పథకం మాత్రమే నేటి వరకు పనిచేస్తోంది. ఇప్పుడు అది కూడా మరమ్మతులకు గురవ్వడంతో రైతులు ఏమీ చేయలేక వర్షాల కోసం ఎదురు చూడమమే మిగిలింది. ఈ పథకం కింద సుమారు 460 ఎకరాల విస్తీర్ణం గల భూములకు సాగునీరందుతుంది. సుమారు 230 రైతు కుటుంబాలకు లబ్ధిచేకూర్చిలా దీన్ని నిర్మించారు. దీంతో ఈ ప్రాంత రైతులకు సమృద్ధిగా సాగునీరందుతుంది. ఈ సమయంలో ఇది మరమ్మతులకు గురవ్వడంతో దీని నిర్వహణ తలకు మించిన భారం కావడంతో రైతులు సాయం కోసం ప్రభుత్వం వైపు ఎదురు చూడడమే తప్ప ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎత్తిపోతల మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఒక్క రూపాయి కూడా నిధులను విడుదల చేయలేదు

ఎత్తిపోతల పథకాల మోటర్లు, పైపులు, బావులు, నదులు నీటిలోనే నిరంతరం ఉండడంతో ఇవి మరమ్మతులకు గురౌతాయి. గత టిడిపి హయాంలో వీటి నిర్వహణకు ఎంతో కొంత నిధులు విడుదల చేసి ఇవి సక్రమంగా పనిచేసేలా చూసేవారు. కానీ గత ఐదేళ్లుగా ఈ పథకాలకు ఎటువంటి నిధులు ఇవ్వకుండా కేవలం రైతులే ఎకరాకు ఎంతో కొంత వసూలు చేసుకుని మరమ్మతులకు అవసరమైన డబ్బులను వాడుకునేవారు. రైతుల నుంచి డబ్బులు కూడా చిన్న చిన్న మరమ్మతుల వరకే ఉపయోగించుకోవడానికి సరిపోతుండేది. గత ఐదేళ్లుగా మోటార్లను, పైపులను బాగు చేయకపోవడంతో అవి చాలావరకు మూలకు చేరాయి.



మరమ్మతులకు గురైన కరాసవలస ఎత్తిపోతల పథకం

నిర్వహణను కంపెనీలకు ఇచ్చే ఆలోచనలు కూటమి ప్రభుత్వం

ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురైతే వాటి బాగుచేయించే బాధ్యతను రైతులు తీసుకోవడంతో వారి వద్దనున్న కొద్దిపాటి మొత్తంతో సరిపోకపోవడంలేదు. దీంతో చాలాసార్లు రైతులు ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద ఈ విషయాలు తెలియజేయగా పై విషయాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వం ఇప్పుడు రాష్ట్రంలో గల అన్ని ఎత్తిపోతల పథకాలు నిర్వహణను మెఘా, నవయుగ, రాఘవ కంపెనీలకు వీటి నిర్వహణను అప్పజెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

ఎమ్మెల్యే అండతోనే కమిషనర్ వేధింపులు?

- **నేరుగా వసూళ్ల పర్వానికి తెర తీసిన బాస్**
- **లబోదిబోమంటున్న మున్సిపల్ ఉద్యోగులు**

ప్రజాశక్తి - పార్వతీపురం

మున్సిపాలిటీలో కమిషనర్ విహెచ్.వెంకటేశ్వర్లు, ఉద్యోగుల మధ్య యుద్ధం తారాస్థాయికి చేరింది. గత కొంతకాలంగా ప్రచ్ఛన్న యుద్ధంలా ఉన్న పరిస్థితి నేడు అమీతుమీ తేల్చుకునే స్థాయికి చేరుకుంది. గురువారం జరిగిన మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు మున్సిపల్ ఉద్యోగులంతా కమిషనర్ వెంకటేశ్వర్లు పై ఫిర్యాదు చేశారు. రాతపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులో ఉద్యోగులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. కమిషనర్ తమను తరచూ వేధిస్తున్నారని, కింద స్థాయి ఉద్యోగుల ముందు అవమానకరంగా తిడుతున్నారని, మహిళా ఉద్యోగులని చూడకుండా దుర్భాషలాడు తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీలో వివిధ విభాగాలకు చెందిన ఫైళ్లకు సంబంధించిన వ్యక్తులను ఇంటికి పిలిపించుకుని బేరసారాలు చేసుకుంటున్నారని ఉద్యోగులు ఆరోపించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాలకు సంబంధించిన అధికారులను పక్కన పెట్టి కమిషనర్ నేరుగా వసూళ్ల పర్వానికి తెర తీయడం ఇరువర్గాల మధ్య యుద్ధానికి దారితీస్తోంది. ఏ మున్సిపాలిటీలోనైనా ఆయా విభాగాల అధికారుల ద్వారా ఫైళు కమిషనర్ వద్దకు వెళ్లే సాంప్రదాయం వుంటుంది. ఆ ఫైళ్లకు సంబంధించిన వ్యక్తులతో ఆయా విభాగాల అధికారులే బేరమాడి అందరికీ కలిపి వసూళ్లు చేస్తారు. కానీ ఇక్కడ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొత్త సాంప్రదాయానికి తెరతీసినట్లు కనిపిస్తోంది.

ఎమ్మెల్యే అండతోనే కమిషనర్ వేధింపులు

మున్సిపాలిటీలో కమిషనర్ వెంకటేశ్వర్లు ఏకపక్షంగా వ్యవహరించడం వెనుక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అండదండలు పుష్కలంగా వున్నట్లు తెలుస్తోంది. అధికారపార్టీ ఎమ్మెల్యే సిఫార్సులతోనే ఆయన ఇక్కడికి కమిషనర్ గా వచ్చారు. గ్రేడ్-3 మున్సిపాలిటీకి కమిషనర్‌గా పనిచేయాల్సిన వెంకటేశ్వర్లును స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్‌గా తీసుకురావడం వెనుక ఎమ్మెల్యే బోనెల ప్రమేయం వున్నదనే ప్రచారం జరుగుతోంది. మున్సిపల్ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే బోనెలకు లక్షలాది రూపాయల లంచాలిచ్చి కమిషనర్‌గా వచ్చానని, ఆ డబ్బు వసూలు చేసుకోవద్దా అని ఉద్యోగులపై ఆయన గర్జించడం చర్చనీయాంశమవుతోంది. ఎమ్మెల్యే బోనెలకు ఇచ్చిన ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాల్లో ఈ అంశాన్ని కూడా ఉద్యోగులు ప్రస్తావించారు. అంటే ఎమ్మెల్యేకు దండిగా ముడుపులిచ్చి వచ్చిన కమిషనర్ ఇష్టారాజ్యంగా వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టినట్లు స్పష్టమవుతోంది. ఆఖరుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సిఫార్సులను బేఖాతరు చేస్తూ కమిషనర్ వెంకటేశ్వర్లు పూర్తిగా ఎమ్మెల్యే బోనెల కనుసన్నల్లో పని చేయడం వెనుక ముడుపుల బంధం దాగి వున్నట్లు రుజువైంది. గత ప్రభుత్వ హయాంలో కౌన్సిల్ తీర్మానం చేసిన అంశాలను కూడా తిరగతోడుతూ వాటిని రద్దు చేసి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని మున్సిపల్ అజెండాలో పేర్కొనడం వివాదాస్పదమవుతోంది. పట్టణంలో నిరాశ్రయుల వసతిగృహం నిర్వహణ బాధ్యతలను రేజేటి దయామణికి ఏడాది క్రితం అప్పగిస్తూ కౌన్సిల్ తీర్మానం జరిగింది. దయామణికి నిరాశ్రయుల వసతిగహం నిర్వహణ కేటాయింపు ని రద్దు చేయాలని తాజా అజెండాలో పేర్కొనడం ముడుపుల కోసమేనని తెలుస్తోంది. గత ప్రభుత్వం హయాంలో మున్సిపాలిటీలో నియామకమైన 23మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని కూడా మున్సిపల్ అజెండాలో పొందుపర్చడం వెనుక కమిషనర్, ఎమ్మెల్యే మధ్య రహస్య ఒప్పందంలో భాగమేనని పలువురు భావిస్తున్నారు. లక్షలాది రూపాయల లంచాలిచ్చి కమిషనర్‌గా వచ్చానని చెప్పుకుంటున్న వెంకటేశ్వర్లు ఆ డబ్బును సంపాదించుకునే యత్నంలో భాగంగానే అధికారులపై జులుం ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే అండతోనే వేధింపులకు గురి చేస్తున్న కమిషనర్‌పై అదే ఎమ్మెల్యేకు ఉద్యోగులు ఫిర్యాదు చేయడం వల్ల ప్రయోజనం వుంటుందనేది ప్రశ్నార్థకమే.


విఆర్ఎస్ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

పర్యాటక కేంద్రంగా విఆర్ఎస్ : మంత్రి

ప్రజాశక్తి - మక్కువ

వెంగళరాయసాగర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా వచ్చే ఏడాది తీర్చుదిద్దునున్నట్లు రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. ఆదివారం వెంగళరాయ సాగరం నుంచి దిగువ ప్రాంత రైతులకు సాగునీటిని ఆమె విడుదల చేశారు. వెంగళరాయ సాగరం ద్వారా ఒక్క మక్కువ మండలానికే కాకుండా బొబ్బిలి సీతానగరం మండల రైతులకు కూడా సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో మూడు వేల రూపాయలకు కూడా పలుకని ఎకరం ధర ఈరోజు ఈ ప్రాజెక్టు ఉన్న కారణంగా రూ.30లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతుందని తెలిపారు. ప్రాజెక్టు మొత్తం 24 వేల ఎకరాల వరకు నీరు కలుస్తుందని అయితే ఈ మండలంలోని ఎడమ కాలువకు రిజర్వాయర్ ప్రారంభం నుండే నీరు అందని పరిస్థితి నెలకొందని, ఈ ప్రాంత రైతులకు నీరు అందాలంటే ప్రాజెక్టు సమీపంలో కూలిపోయిన యాక్విడట్ పనులు పూర్తి చేస్తేనే తప్ప నీరు వెళ్లే పరిస్థితి లేదని మావుడి మాజీ సర్పంచ్ అఖ్యాన తిరుపతిరావు, శంబర ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు మార్కొండపుట్టి సీనియర్ నాయకులు చొక్కా పు బుచ్చినాయుడు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అక్విడక్ట్‌ను నిర్మిస్తే సుమారు 5 వేల ఎకరాలకు నీరందుతుందని ఈ ఎడమ కాలు ద్వారా ప్రధానంగా గిరిజన రైతులకు మేలు అవుతుందని మంత్రి దృష్టికి సభాముఖంగా తీసుకువెళ్లారు. ప్రాజెక్టు అభివృద్ధి విషయంలో తాను ఎప్పుడూ ముందుంటానని జైకా నిధులు విడుదల కాగానే ప్రాధాన్యత పద్ధతిలో ఒక్కొక్క పని చేసుకుంటూ వెళ్తామన్నారు. దీనికి స్థానికంగా ఉన్న ప్రాజెక్టు చైర్మన్ తో పాటు అధికారులు, మెంబర్లు కూర్చొని ఒక సమావేశం ఏర్పాటు చేసుకొని విధివిధానాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సూపరిండెంట్ ఇంజనీర్ ఆర్.అప్పారావు మాట్లాడుతూ ప్రాజెక్టు మొత్తం 1.68 నిల్వ కాగ, ప్రస్తుతానికి ప్రాజెక్టులో 1.5 మీరు నిల్వ ఉందని మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలటిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు, ప్రాజెక్టు చైర్మన్ ఎం.గోదావరి, ఇఇడిఎస్ ప్రదీప్, డిఇ సురేష్, ఎఇఇలు రాజశేఖర్, ప్రశాంత్ శ్రీహరి ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల దత్తత స్వచ్ఛందమే : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని బంగారు కుటుంబాల దత్తత స్వచ్ఛందమేనని, మార్గదర్శిల అభీష్టమే తుది నిర్ణయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. పీ4 కింద బంగారు కుటుంబాల దత్తతపై జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాల దత్తతపై ఎటువంటి ఒత్తిడి ఉండబోదని, ఇష్టపూర్వకంగా ముందుకు వచ్చిన వారినే మార్గదర్శిగా ఎంపిక చేస్తామన్నారు. మార్గదర్శుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసిందని, దాన్ని తూ.చ పాటించాలని హితవు పలికారు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు ఇలా అన్ని వర్గాల్లోని వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవచ్చని తెలిపారు. బంగారు కుటుంబాలకు ఆర్థికంగా లేదా ఇతర సహాయ సహకారాలను అందించి మార్గదర్శి ఆదుకోవచ్చని, ఈ విషయాన్ని వివరించి మార్గదర్శిల పేర్లను పీ4లో నమోదు చేయాలని అన్నారు.

ఆగస్టు 15 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని, కావున జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను ఈనెల 10లోగా సాధించాలని అధికారులను ఆదేశించారు. దత్తత తీసుకోబోయే మార్గదర్శిలకు చాలా వరకు సందేహాలు ఉంటాయని, వాటిని నివృత్తి చేసి, ఇష్టపూర్వకంగా ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఈ ఎంపిక ప్రక్రియలో అధికారులపై ఎటువంటి ఒత్తిడి ఉండబోదని, మానవతా దక్పథంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా ఉత్తేజపరచడమే అధికారుల లక్ష్యమని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి ఎన్నికల నిర్వహణలో జాప్యమెందుకో?

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జెడ్పీటీసీ, ఎంపిటిసి, సర్పంచ్‌ల ఉప ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. వైఎస్సార్ కడప జిల్లాలో రెండు జెడ్పీటీసీ సెగ్మెంట్‌లకు, మిగిలిన చోట్ల ఎంపిటిసి, సర్పంచ్‌ల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల ప్రక్రియను ప్రకటించింది. అయితే మన్యం జిల్లాలో గత నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న సాలూరు జెడ్పీటీసీ సెగ్మెంట్ ఈ ఎన్నికలతో కలిపి నిర్వహించకపోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదు. గతంలో జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికైన అంబటి అనిల్‌కుమార్ ఏడాది లోపే మృతి చెందారు. అప్పటి నుంచి జెడ్పీటీసీ సెగ్మెంట్ ఖాళీగానే ఉంది. కొద్ది రోజుల క్రితం విడుదలైన నోటిఫికేషన్‌లోనైనా సాలూరు జెడ్పీటీసీ సెగ్మెంట్ ఎన్నిక నిర్వహిస్తారని ప్రధాన పార్టీల నాయకులు భావించారు. నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న సాలూరు జెడ్పీటీసీ సెగ్మెంట్ ఎన్నిక నిర్వహించకుండా దీని కంటే వెనుక ఖాళీ అయిన జెడ్పీటీసీ సెగ్మెంట్లకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ జరుగుతోంది. ఈ జెడ్పీటీసీ సెగ్మెంట్ ఎన్నిక నిర్వహించకుండా జాప్యం చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న తరుణంలో ప్రభుత్వ వ్యతిరేకత కనిపిస్తున్నందునే ఎన్నిక నిర్వహించకుండా జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.



పార్వతీపురం పట్టణంలో ప్రచారం చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి : సిపిఎం

5న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నాకు కదలిరండి

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనలు విరమించుకోవాలని, అదనపు ఛార్జీల పేరుతో వినియోగదారులపై మరింత భారాలు వేయొద్దని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని, ఛార్జీల పెంపు భారాన్ని వివరిస్తూ మండలంలోని అంటిపేట, రెడ్డివానివలస, రామవరం, కాసయ్యపేట, సీతానగరంలోని హడ్కో కాలనీ, బుడ్డిపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం మోడీ ఆదేశాలకు తలొగ్గి అదానీకి 25 ఏళ్ల పాటు 7వేల మెగా వాట్స్ సోలార్ విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం చేసుకుందన్నారు. కానీ గత ఎన్నికల్లో వైసిపి ఓటమి పాలయ్యిందన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను నిరసిస్తూ, స్మార్ట్ మీటర్లను బిగిస్తే బద్దలు కొట్టండి మీకు నేను అండగా ఉంటానని స్వయంగా నారా లోకేష్ పిలుపునిచ్చారని, నేడు అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ విధానంలోనే నేటి కూటమి ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 5న పార్వతీపురంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరుగు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పార్వతీపురంటౌన్ : స్మార్ట్ మీటర్లను అడ్డగోలుగా బిగించే నిర్ణయాని విరమించుకోవాలని, ఈనెల 5న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తలపెట్టిన ధర్నాకు కదలిరావాలని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని జగన్నాధపురం ఒకటవ వార్డులో ఆదివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఎస్.ఉమా, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలపై జాప్యమెందుకు?

- **ఆందోళనలో విద్యార్థులు**
- **పోరుబాటులో ఎస్ఎఫ్ఐ**

ప్రజాశక్తి - సీతంపేట

విద్య కోసం ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, కేజీ నుంచి పీజీ వరకు మీ పిల్లలను చదివించే బాధ్యత ప్రభుత్వానిదేనని మన పాలకులు ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. అయితే అవి ఉపన్యాసాలకే పరిమితమవుతున్నాయి. ఇందుకు నిదర్శనం ఆగస్టు వచ్చినా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించలేదు. ఇప్పటికే విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ప్రవేశాలు కల్పించాలని ఆందోళన బాట పట్టాయి. ఇప్పటికే ఇంటర్ ఉత్తీర్ణత ఎంసెట్ క్వాలిఫై అయిన విద్యార్థులకు మొదటి విడత కౌన్సిలింగ్ కూడా పూర్తయింది. కానీ డిగ్రీ కళాశాలల్లో మాత్రం ఇంతవరకు కౌన్సిలింగ్ ప్రవేశాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగా ప్రవేశాలు చేపట్టడం వల్ల విద్యార్థులు డ్రాప్ అవుట్‌గా మారే ప్రమాదం ఉంది.

సాధారణంగా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు గతేడాది జులై ఒకటో తేదీనే విద్యార్థులు ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆగస్టు 16 నుంచి 30 వరకు రెండో విడత, సెప్టెంబర్‌లో మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు కానీ ఈ ఏడాది ఆగస్టు వచ్చేసినా ప్రభుత్వం వెబ్సైట్ ఓపెన్ చేయకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 2021 నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించడం ప్రభుత్వాలు ప్రక్రియ మొదలుపెట్టాయి. అంతకు ముందు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి సీట్లు సర్దుబాటు చేసేవారు. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియ ఆలస్యం చేయడం వల్ల విద్యార్థులు డ్రాపౌట్‌గా మారే ప్రమాదం ఉంది. ప్రవేశాలు త్వరగా ప్రారంభిస్తే సీట్లు వచ్చే విద్యార్థులు కాలేజీ చేరగా, సీట్లు రానివారు ప్రత్యామ్నాయంగా మరో విద్యను అభ్యసరించేందుకు అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికైనా డిగ్రీ ప్రవేశాలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

త్వరలోనే ప్రవేశాలు కల్పిస్తాం

ప్రభుత్వం ఆన్లైన్ వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తాం. విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నాం.

సుశాంత్ జన ప్రిన్సిపల్
ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సీతంపేట.

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు కల్పించాలి

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు వెంటనే కల్పించాలి. పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ నిధులు ప్రభుత్వం విడుదల చేయాలి. నియోజకవర్గ కేంద్రాల్లో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి. డిగ్రీ కాలేజీ వద్ద మౌలిక వసతులు కల్పించాలి.

- టి అఖిల్,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత సోలార్ విద్యుత్

- **ఇంటి పైకప్పు అద్దె కింద నెలకు రూ.200 పంపిణీ**
- **'ప్రజాశక్తి'తో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మల్లికార్జునరావు ముఖాముఖి**

ప్రజాశక్తి - పార్వతీపురం


ప్రధాన మంత్రి సూర్యఘర్ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మల్లిఖార్జునరావు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన రీ వేంప్ట్ డిస్ట్రిబ్యూషన్ సెక్షన్ స్కీం కింద అన్ని రాష్ట్రాలలోనూ స్మార్ట్ మీటర్ల బిగింపు జరుగుతోందని తెలిపారు. జిల్లాలో విద్యుత్‌శాఖ చేపడుతున్న పనులను ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆయన మాటలోనే...

◆పిఎం సూర్య ఘర్ కార్యక్రమం ఎందుకు మందకొడిగా సాగుతోంది?

ప్రధానమంత్రి సూర్యఘర్ కార్యక్రమంలో భాగంగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరు వేగవంతం చేయాలని ప్రయత్నిస్తున్నాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల్లో నెలకొన్న కొన్ని అపోహల కారణంగా కొంత మందకొడిగా సాగుతోంది. భవిష్యత్ అంతా సోలార్ విద్యుత్‌దే. అనివార్యంగా అందరూ సోలార్ విద్యుత్ వినియోగంలోకి వెళ్లాల్సిందే.

◆పిఎం సూర్య ఘర్ యోజన కార్యక్రమంలో అంశాలేమిటి?

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ విద్యుత్ సరఫరా చేస్తాం. ఇందుకు కావాల్సిన పరికరాలు అమర్చి విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఇంటిపైకప్పుకు నెలకు రూ.200 చెల్లించనున్నాం. ఈ కార్యక్రమం అమలులో మూడు కేటగిరీలు ఉన్నాయి. ఇంటిపైకప్పు విస్తీర్ణం బట్టి సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలోవాట్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రూ.30వేలు సబ్సిడీ మంజూరు చేస్తుంది. రెండు కిలోవాట్ల సామర్థ్యం గల ప్లాంట్ కైతే రూ.60వేలు, మూడు కిలోవాట్ల సామర్థ్యం గల ప్లాంట్ ఏర్పాటు కైతే రూ.78వేలు సబ్సిడీ మంజూరవుతాయి. ప్రస్తుతం వెయ్యి రూపాయల కరెంట్ బిల్లు వస్తున్న ఇంటికి ఒక కిలోవాట్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తే విద్యుత్ బిల్లు రూ.338లే వస్తుంది. ఏడాదికి సుమారు రూ.8వేలు ఆదా అవుతుంది. రెండు కిలోవాట్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తే రూ.2వేలు విద్యుత్ బిల్లు వస్తున్న ఇంటికి సోలార్ విద్యుత్ ద్వారా సుమారు రూ.333 బిల్లు రావొచ్చు. దీనివల్ల ఏడాదికి రూ.20వేల వరకు ఆదా అవుతుంది. మూడు కిలోవాట్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తే రూ.3వేలు విద్యుత్ బిల్లు వస్తున్న ఇంటికి రూ.293 విద్యుత్ బిల్లు వచ్చే అవకాశం ఉంది. ఇంటికి వాడుకున్న విద్యుత్ పోగా మిగిలిన విద్యుత్ ని ప్రభుత్వానికి విక్రయించవచ్చు.



◆జిల్లాలో ఇంతవరకు ఎన్ని సోలార్ విద్యుత్ కనెక్షన్లు బిగించారు?

జిల్లాలో ఇంతవరకు 400 సోలార్ విద్యుత్ కనెక్షన్లు బిగించాం. ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రయత్నిస్తున్నాం.

◆స్మార్ట్ మీటర్ల పై ప్రజల్లో వ్యతిరేకత ఎందుకు వస్తోంది.

అన్ని రాష్ట్రాల్లోనూ స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమం అమలవుతోంది. 2021లో రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకే స్మార్ట్ మీటర్ల బిగింపు జరుగుతోంది. వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు ఉన్న వారికి తొలి ప్రాధాన్యత కింద స్మార్ట్ మీటర్ల బిగింపు చేపడుతున్నాం. నెలకు రూ.2వేలు పైబడి విద్యుత్ బిల్లు వస్తున్న వారికి స్మార్ట్ మీటర్ల బిగింపు జరుగుతోంది. ఇంతవరకు జిల్లాలో 13,239 సర్వీస్‌లకు స్మార్ట్ మీటర్ల బిగించాం.



◆జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఎన్ని?

జిల్లాలో ప్రస్తుతం ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 22,277. మరో 908 కనెక్షన్లకు దరఖాస్తు లు పెండింగ్ లో ఉన్నాయి.

◆జిల్లాలో ఉద్యోగుల కొరత వుందా?

జిల్లాలో రెండు డివిజన్లు, 16సెక్షన్లు వున్నాయి. ఇద్దరు ఇఇలు, నలుగురు డిఇఇలు వున్నారు. ఎఇల కొరత బాగా వుంది. 16 సెక్షన్లకు 8మందే ఉన్నారు.

ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల్ని నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయనక్కర్లేదు. ఆన్ లైన్ లోనూ 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. వెంటనే సంబంధిత సెక్షన్ల సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.



పిల్లర్ వరకు నిర్మించి మధ్య నిలిచిపోయిన పంచాయతీ కార్యాలయం

పిల్లర్లకే పరిమితమైన పంచాయతీ కార్యాలయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎం.రాజుపురం, కె.ఇచ్ఛాపురం గ్రామాల్లో చేపడుతున్న పంచాయతీ కార్యాలయాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. సుమారు రూ.32 లక్షల అంచనా వ్యయంతో పంచాయితీల కార్యాలయాల భవనాల పనులు ప్రారంభించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏకలవ్య పిఇటిని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శివన్నపేటలో ఉన్న ఏకలవ్య పాఠశాల పిఇటిని తక్షణమే సస్పెండ్ చేయాలని మన్యం జిల్లా గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏకలవ్య మోడల్ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులను పిఇటి దారుణంగా కొట్టారని, అధికారులు దీనిపై తూతూ మంత్రంగా విచారణ చేపట్టి చేతులు దులుపుకున్నారు తప్ప పిఇటిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. తరచూ ఇటువంటి సంఘటన జరుగుతూ ఉన్నాయని, కావున ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆశ్రమ పాఠశాలలో క్రీడా ఉత్సవాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన ఆశ్రమ పాఠశాలలో క్రీడా ఉత్సవాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎన్.జాకబ్ దయానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ప్రతి ఏటా రాష్ట్రంలో ఏదో ఒకచోట క్రీడ, సాంస్కృతి పోటీలు క్రమం తప్పకుండా జరిగేవి అని అన్నారు. రాష్ట్ర గిరిజన క్రీడాకారులు విద్యార్థులను ప్రోత్సహించి ఈ ఏడాదీ క్రీడా సాంస్కృతిక పోటీలు క్లస్టర్ స్థాయి ఐటిడిఎ రాష్ట్రాల్లో క్రీడలు నిర్వహించి గిరిజన విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని కోరుతున్నారు.



ఔట్‌పోస్టును పరిశీలిస్తున్న ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు

నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దరమే లక్ష్యమని కురుపాం ఎక్సైజ్ సిఐ పి. శ్రీనివాసరావు అన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు ఆదేశాల మేరకు పోలీస్, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా చినమేరంగిలో ఏర్పాటు చేసిన ఔట్ పోస్టులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ పోస్ట్ పర్యవేక్షణకు ఎల్విన్‌పేట సర్కిల్ పరిధి నుంచి కానిస్టేబుళ్ల జె.శ్రీనివాసరావు, పి.త్రినాధరావును డిప్యూటీ చేశామన్నారు. ప్రజలు నాటు సారా తయారీ – రవాణా – అమ్మకాలు చేసే వారిపై ఫిర్యాదులు 6302936599 ఫోన్ నెంబర్ కు తెలియజేసి నాటు సారా నియంత్రణ లో సహకరించాలని కోరారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని బుడగరాయి సమీపాన 600 లీటర్లు బెల్లం ఊటలను పోలీసులు ఆదివారం సీతంపేట ఎస్సై వై అమ్మనరావు ఆధ్వర్యంలో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా సారా తయారీకి మూడు సరుకు అందించిన సారా రవాణా చేసిన చర్యలు తప్పవని అన్నారు. సారా విక్రయించిన కేసులు తప్పవని హెచ్చరించారు. సారా నిర్మూలనకు అంతా సహకరించాలని కోరారు.



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

వాహనదారులు హెల్మెట్లు ధరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేట జంక్షన్‌లో ఆదివారం ఎస్సై ఎం.రాజేష్ వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహనదారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, దీనివల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి అనవసరపు కాల్స్ వస్తే వాటిని తిరస్కరించాలన్నారు. అంతేకాకుండా వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసేజ్‌లను గమనించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలని అన్నారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, ప్రతి ఇంటి యజమాని వారి పిల్లలను పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ డి.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది తిరుపతిరావు నాయుడు, సురేష్ వాహనదారులు పాల్గొన్నారు.

సూర్యపీఠంలో సప్త సూర్య నమస్కారాలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో ఉన్న శ్రీ సూర్య పీఠంలో ఆదివారం బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో ఆదిత్యునికి సప్త సూర్య నమస్కారాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, జా.సూ.శర్మ, ఉమా శర్మ, ఆదిత్య శర్మ, హర్ష శర్మ, కేశవ శర్మ, సంతోష్ శర్మ, దివాకర శర్మ, టి.ఆర్.కె. శర్మ, ధరణీ శర్మ వైదిక సహకారం అందించారు..

నాగావళిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో బల్లంకి వీధికి చెందిన దుర్గాప్రసాద్ ఆదివారం శ్రీకాకుళం జిల్లా బూర్జి మండలం లాభం గ్రామ సమీపాన స్నేహితులతో కలిసి నాగావళి నదిలో స్థానానికి వెళ్లి కొట్టుకుపోయాడు. మిగిలిన స్నేహితులు సురక్షితంగా బయటపడినప్పటికీ దుర్గాప్రసాద్ లోతుల చిక్కుకొని మృతి చెందాడు స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెతికితీశారు బూర్జ పోలీసులు కేసు నమోదు చేసి జరిగే పడుతున్నారు. పట్టణంలోని తమ్మినాయుడు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. తండ్రి సాసుబుల్లి రాము తల్లి భారతి కుమారుడు మృతితో రోధిస్తున్నారు

కాపలా కాయాల్సిన అధికారే కాజేస్తున్నారు?

మూడేళ్లలో 600 టేకు చెట్లు మాయం

ప్రజాశక్తి - కొమరాడ

కాపలా కాల్సిన అధికారులే కాజేయడం మొదలైంది. దీంతో ప్రభుత్వ సొత్తు పరులపాలవుతుంది. ఇలాంటి సంఘటనే మండలంలోనికలప దందా గత మూడేళ్లుగా సాగుతోంది. అగ్రిగోల్డ్ కంపెనీకి చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సిఐడి పరిధిలో కేసులు నడుస్తుంది. అయితే ఆ భూముల్లో విలువైన టేకు కలపను కాపలా కాయాల్సిన అధికారే విలువైన టేకు చెట్లను కాజేస్తున్నారన్న ఆరోపణలు మండలంలో దుమారం లేపుతున్నాయి. ఈ టేకు చెట్లను కాపాడాల్సిన అటవీ శాఖ బీటు అధికారే అక్కడ వ్యాపారులతో చేతులు కలిపి ఈ మూడేళ్ల కాలంలో 600 విలువైన టేకు చెట్లను మాయం చేసినట్లు గ్రామ పెద్దల నుంచి మాటలు వినిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం అగ్రిగోల్డ్ భూముల్లో విలువైన టేకు కలపను వేలంపాట వేసేందుకు సిద్ధమైన సమయంలో అటవీశాఖ అధికారులకు చెట్లు ఎన్నో ఉన్నాయి లెక్కవేసి వాటి విలువను చెప్పాలని నివేదికలు ఇవ్వాలని కోరుతుంటే తప్పుడు లెక్కలు చూపుతూ మరో పక్క చెట్లు నరికి వేసి జేబులు నింపుకుంటున్నారు.

మండలంలోని ఉలిపిరి పంచాయితీలో 46 ఎకరాలు, చోళపదం పంచాయతీలో 29 ఎకరాలు అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన 75 ఎకరాల భూమి ఉంది. ఆ భూముల్లో సుమారు 50 ఎకరాల వరకు విలువైన 30 ఏళ్ల నాటి టేకు తోటలు ఉన్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో వివిధ కేసుల్లో అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుచి అగ్రిగోల్డ్ ఆస్తులు అన్ని సిఐడి అధికారులు ఆధ్వర్యంలో స్థానిక అధికారులు పర్యవేక్షణలో ఆస్తులన్నీ ఎవరూ అక్రమాలు చేయకుండా రక్షించుకొని వస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. మూడేళ్ల క్రితం ఉలిపిరికి ఒక ఫారెస్ట్ బీట్ అధికారి విధులకు హాజరయ్యారు. అప్పట్నుంచి అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన ఎంతో విలువైన టేకు చెట్లు తోట లోపల ఉంచి ఒక్కొక్కటిగా గొడ్డలి వేటుకు బలవుతూ వస్తున్నాయని స్థానికుల నుంచి ఆరోపిస్తున్నారు. ఆ అధికారికి స్థానికంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న కలప వ్యాపారులతో చేతులు కలుపుకొని రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన టేకు కలప వారానికి రెండు, మూడు రోజుల్లో నాటు బళ్లు, ట్రాక్టర్ల సహాయంతో తరలిస్తూ, జేబులు నింపుకుంటున్నట్లు తెలుస్తోంది. అటవీశాఖ అధికారి మద్దతుతోనే కలప వ్యాపారస్తులు బరితెగించి విలువైన టేకు తోటను నాశనం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. చెట్లును కాపాడాల్సిన ఫారెస్ట్ అధికారులే వ్యాపారులతో చేతులు కలిపి ఇలా ప్రభుత్వ ఆస్తులను నాశనం చేయడంపై స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో నాటుబండ్లపై తరలిస్తున్న కలపను స్థానికుల సమాచారంతో రెవెన్యూ అధికారులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు అప్పగించని విషయం తెలిసిందే. ఇదే కలప కాకుండా అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన తోటల్లో ఉన్న చెట్లను నరికివేసి తరలింపునకు సిద్ధంగా ఉన్న కర్రలను చూసి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండా దొంగ పత్రాలు సృష్టించి విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు కలప తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అటవీ శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను ఇలా ఇష్టానుసారంగా అమ్మకాలు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



తరలించేందుకు సిద్ధం చేసిన టేకు దుంగలు



ఆందోళన చేస్తున్న ఆటోకార్మికులు

'వాహన మిత్ర' అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయాలనుకుంటే ఈ ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని ముంగారమ్మ తల్లి ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. మండలంలోని మామిడిపల్లిలో ముంగారమ్మ తల్లి ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో రంగంలో లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారని, మన్యం జిల్లా లాంటి మన జిల్లాల్లో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక ఆటో రంగంలో యువత స్థిరపడ్డారని తెలిపారు. అనేకమంది ఫైనాన్స్ ద్వారా ప్రైవేట్ వ్యక్తుల వద్ద వడ్డీలకు డబ్బులు తెచ్చి ఆటోలు కొన్న వారు కొంతమంది అయితే, ఫైనాన్స్ ద్వారా తెచ్చిన వారు కొంతమంది, మరి కొంతమంది రోజువారీ కూలి కింద డ్రైవర్లుగా వెళ్తున్న వారు ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తే ఆటో కార్మికులే కాకుండా వారి కుటుంబాలు కూడా రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం ఆటో కార్మికులకు ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా వాహన మిత్ర పథకాన్ని అమలు చేసి రూ.15వేలు డ్రైవర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్న ఫైనాన్స్, బ్యాంక్ అప్పులు తీరేలా ప్రతి డ్రైవర్ కుటీర పరిశ్రమలు అభివృద్ధి చేసుకునేందుకు రుణాలివ్వాలని, తద్వారా వారికి ఉపాధి కొనసాగేలా నిర్ణయం చేసి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉచిత బస్సు పథకం ప్రారంభించక ముందే ఆటో రంగంలోని కార్మికులకు ఏ విధమైన భరోసా ఇస్తారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆటో రంగంలో ఉండే లక్షలాదిమంది యువతకు ఉపాధి లేకుండా రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం ఈ విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జరజాపు జ్యోతీష్, అప్పలరాజు, నర్సింగ్, సత్యనారాయణ కార్మికులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన సంప్రదాయాలను గౌరవించాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజన సంప్రదాయ, ఆచారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈనెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బోసుబొమ్మ జంక్షన్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీని నిర్వహించారు. మంత్రి నియోజకవర్గ గిరిజనులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, భాష, సాంస్కృతిక వారసత్వం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు, వసతి గృహాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



గిరిజన గ్రామాల్లో సంచరిస్తున్న ఏనుగులు

గిరిజన గ్రామాల్లో గజరాజులు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపాన గల దురిబిలి, నేరేడు వలస, పెళ్లివలస పరిసర ప్రాంతాల్లో తొమ్మిది ఏనుగులు గుంపు సంచారిస్తుండగా, మరోవైపు తూర్పు ముఠాకు చెందిన జరడ పంచాయతీలో గల గెడ్డగూడ, మూలగూడా, పట్టాయిగెడ్డ, కొత్తగూడ పరిసర గిరి శిఖరాల్లో మరో నాలుగు ఏనుగుల గుంపు సంచారిస్తుంది. దీంతో గిరిజనులకు కంటిమీద కునుకులేకుండా గజ గజ వణుకుతున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ అసలే కొండపోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటామని, అటువంటిది ఏనుగుల గుంపు కొండ ప్రాంతాల్లో తిరుగుతూ తమ పంటలు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తమ గ్రామాలు కూడా కొండలకు దగ్గరగా ఉండడంతో ఏ క్షణాన గ్రామాలపైకి ఏనుగులు వచ్చి దాడి చేస్తాయో అర్థం కాక కంటిమీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని తెలిపారు. మరోవైపు కొండపోడు పనులకు వెళ్లలేక కొండల్లో పండిన పంటలు ఏరి తెచ్చుకోలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున అటవీశాఖ అధికారులు స్పందించి తమ పరిసర గ్రామాల నుంచి ఏనుగులు గుంపులను దూరంగా తరలించి తమ ప్రాణాలకు, మా పంటలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వరహాలగెడ్డలో పూడిక తీత లేనట్లేనా?

పట్టణ ప్రజలకు తప్పని ముంపు బాధ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రమైన పార్వతీపురం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు, వరహాల గెడ్డలో పేరుకుపోయిన పూడిక తీత తొలగింపు ఈ ఏడాది లేనట్లేనా అన్న విమర్శలు పట్టణ ప్రజలు, పర్యావరణ ప్రేమికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. జూన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలో పొందుపర్చిన అంశాల్లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు, 30 వార్డుల్లో ఉన్న చిన్న, పెద్ద కాలువలు, వరహాల గెడ్డలో పేరుక పోయిన పూడిక తీతలు తొలగించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లతో సుమారు రూ.30 లక్షలతో ఆమోదం పొందింది. ఆమోదం పొంది నెలరోజులు పూర్తయినా కొన్ని వార్డుల్లో తూతూ మంత్రంగా పూడికతీత పనులు జరిపిస్తున్నారే తప్ప, ఆ పూడికలను ట్రాక్టర్ల పై తరలించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టడం లేదు. దీనివల్ల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కాలువల్లో తీసిన పూడికలు కాలువల్లోకి జారిపోవడంతో పరిస్థితి మామూలే. పట్టణంలో రాయగడ రోడ్డు శివారు నుంచి, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు పూడిక తీత పనులను టెండర్ దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటికీ మొదలు పెట్టకపోవడం వెనుక మర్మమం ఏమిటో అర్థం కావడం లేదు. సకాలంలో జరగాల్సిన ఈ పనుల గురించి మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పూడికతీత పనులు చేపట్టకపోతే ఆగస్టు, సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాలువల్లో ఉండే వాడుక, మురుగు, వర్షపునీరు కలిసి ప్రధాన రహదారిపైకి చేరుతుంది. దీంతో ప్రధాన రహదారితో పాటు లోతట్టు కాలనీలు నీట మునిగే అవకాశం ఉంది. దీనివల్ల పాదాచారులు, వాహనదారులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యేతో పాటు, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

తాడివలసలో ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని తాడివలస గిరిజన గ్రామంలో ఆదివారం ఆదివాసీ దినోత్సవం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన జరిగింది. తొలుత సంఘం జెండాను ఆదివాసీ మహిళ సేబి మెరకమ్మ ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు సేబి చిన్నారావు మాట్లాడుతూ ఆదివాసీలు పోరాడే సాధించుకున్న హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందదన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిఒ 3ను పునరుద్ధరించాలని, పీసా చట్టం పగడ్బందీగా అమలు చేయాలని, గిరిజనులకు స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, మెగా డీఎస్సీ నుంచి గిరిజనులను తొలగించి నూటికి నూరు శాతం గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు ఐటిడిఎ ద్వారా కల్పించాలని, గిరిజన చట్టాలకు రక్షణ కల్పించాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ఐటిడిఎ, జిసిసి వంటి సంస్థలు సాధించుకోవడం జరిగిందని, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇవి నిర్వీర్యానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గిరిజన హక్కులను తుంగలో తొక్కిన వాళ్లే ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జెండాలు ఎగురవేసి గిరిజనులను మోసగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నూటికి నూరు శాతం ఉద్యోగ భద్రత గిరిజనులకు కల్పించాలని, అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, విద్య, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గన్నెల పండయ్య, లచ్చయ్య, చేబీ తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు

సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం : టిడిపి

ప్రజాశక్తి - సీతానగరం

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యం నాయుడు, ఆర్.వేణుగోపాల నాయుడు అన్నారు. మండలంలోని జోగింపేటలో గుచ్చిమి కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ బొమ్మినేని లక్ష్మణరావు ఇంటి వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మంది విద్యార్థులకు అందజేశామన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద మండలంలో రైతులందరి అకౌంట్లో జమ చేశామని తెలిపారు. శనివారం సభలో పాల్గొన్న రైతులకు, కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల టిడిపి నాయకులు కె.అరవింద్ కుమార్, బి.శ్రీనివాసరావు, బలంగ శ్రీనివాసరావు, తెంటు రామారావు, గుణుపూరు అన్నమయ్య, శ్రీనివాసరావు, గుచ్చిమి కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు బోరాడ చిరంజీవి, తేలు చంద్రశేఖరు పాల్గొన్నారు.

విత్తన పొదుపు.. తగ్గుతున్న మదుపు

- రైతుల మన్ననలు పొందుతున్న బెంగాల్ కూలీలు
- నాట్లు వేసే విధానం అమోఘం

ప్రజాశక్తి -మక్కువ

ఖరీఫ్ సమయంలో ప్రతి ఏటా పశ్చిమబెంగాల్ కూలీలు మండలంలో వరి నాట్లు వేసేందుకు రావడం పరిపాటిగా వస్తుంది. పశ్చిమబెంగాల్‌లోని బోషిగాట్ సబ్ డివిజన్ నార్త్ సోబిష్ పూర్ణ24 పిజిఎస్‌కు చెందిన 12 మంది పురుషులు వరి నాట్లు వేసేందుకు ఈ ప్రాంతానికి వస్తుంటారు. మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీ పరిధిలో పెదగైశిలకు చెందిన టి.వెంకట శ్రీనివాసరావు అనే రైతు ఈ కూలీలను పొలంలో వరి నాట్లు వేసేందుకు తీసుకువచ్చారు. స్థానికంగా వరి నాట్లు ఇక్కడి కూలీలు వేసే దానికంటే బెంగాల్ కూలీలు చేసే పనితో ఒక బస్తా వరి నారు మూడు ఎకరాలకు సరిపడుతుందని, ఇలా నాట్లు వేయడం వల్ల రైతుకు ఒకవైపు విత్తనం పొదుపుతో పాటు కూలీలు మదుపు కూడా తగ్గుతుందని, అలాగే దిగుబడి కూడా అధికంగా వస్తుందని రైతు వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ఎకరానికి అయ్యే ఖర్చుతో మూడు ఎకరాలకు వరి నాట్లు వేయవచ్చని, అందుకే బెంగాల్ నుంచి ఇక్కడికి రప్పించి వారికి వసతి సౌకర్యాలు కల్పించి నాట్లు వేయిస్తున్నామన్నారు. బెంగాల్‌లో ఒక బస్తా వరి నారుకు రూ.4వేలు కూలి రేటు పలకగా, ఇక్కడ రూ.6,500 పలుకుతుండడంతో అక్కడ కూలీలు కూడా ఏపీ ప్రాంతానికి ఖరీఫ్ కాలంలో ఇక్కడకు రావడానికి మొగ్గు చూపుతూ వలస వస్తూ ఉంటున్నారు. ఏది ఏమైనా వరుసల్లో వరి నాట్లు వేయడంలో బెంగాల్ కూలీలు ఆరితేరిన వారిని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. అందువల్లే ఈ ప్రాంత రైతులు కూడా వారి రాక కోసం ఎదురుచూస్తు ఉంటారని చెప్పొచ్చు. ఇక్కడ ఎక్కువ శాతం మహిళలే వరి నాట్లు వేయడం జరుగుతూ ఉంది. అక్కడ నుండి వచ్చిన వారంతా పురుషులు కావడంతో పాటు చక చకా వరి నాట్లు వేసే విధానాన్ని చూసి ఇక్కడ మహిళలు కూడా ఆశ్చర్యం చెందుతూ వారిని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.



వరుస పద్ధతిలో నాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు